సీరియల్

(16వ భాగము)

ఆలోచించసాగాను. ఆమెను మెల్లగా నచ్చజెప్పి, నా కోసం రాకుండా చెయ్యగలిగితే బాగుంటుందనిపించింది. కానీ ఆమె వింటుందన్న నమ్మకం కలగడంలేదు. మరో మారు ప్రయత్నిద్దామని అనుకున్నాను. నా ఆలోచన నాయకుడికి చెప్పాను.

"పిచ్చివాడా? కులం కట్టు తెంపుకొని, నీకోసం అడవిలో ఒంటరిగా అంతసేపు కాచుకునే మనిషి, తన కోరిక తీర్చుకోకుండా వెళ్ళిపోతుందనే అనుకున్నావా? నాకు నమ్మకం లేదు. మావాళ్ళు మొండిఘటాలు. మనసుకు ఎంతతోస్తే అంతే! ప్రాణాలతీపి, బ్రతుకుపైన ఆశ, వాళ్ళకు అసలు వుండవు." అన్నాడు.

"అయితే నన్నేం చెయ్యమంటావ్?" అన్నాను.

"నే చెప్పినట్టు చెయ్యి" నాయకుడు చెప్పాడు.

మరో పనినిముసాలు పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కూర్చున్నాడు.

"ఇంక బయలుదేరుదామా!" అడిగాడు నాయకుడు.

"ఆc!" అన్నాను అయిష్టంగానే.

ఇద్దరం బయలుదేరాం. మా వెంట మరో ఇద్దరు అడవి మనుషులుకూడా కదిలారు. అందరం నడుస్తున్నాం.

అంతకుముందు ఆడమనిషి వుంటానని చెప్పినచోటు దగ్గరకు వచ్చేశాం. దూరంనుంచే చూపించాను నాయకుడికి. మా కెవ్వరూ కనుపించలేదు. ఆమె ఏమయిందాని ఆశ్చర్య పోయాను. మారాక బహుశా పనిగట్టి తప్పించుకు పారి పోయి వుంటుందని ఊహించాను.

అందరం చెట్టుక్రింద నిలుచున్నాం.

"ఇక్కడేనా ఆమె వుంటానంది?" అడిగాడు నాయ కుడు.

"అవును" అన్నాను.

నాయకుడు చుట్టుప్రక్కల చూశాడు. నేనూ చూశాను. ఆమెలేదు. లేకపోవడం నాకు ఆనందం కలి గించింది.

ఇద్దరం కొంతసేపుచూసి ఆ తర్వాత మా మఠాం వైపు దారితీశాం. మాకు వెనకగా కొంతదూరంలో నాయకుడి అనుచరులు నడవసాగారు.

"ఆమె విషయం ఇంతటితో ఆపివెయ్యడం మంచిదను కుంటాను" అన్నాను.

"అంటే..." ప్రశ్నార్థకంగా చూశాడు నాయకుడు.

"ఈ విషయం అనవసరంగా వాళ్ళు నాయకుడికి చెప్పి ఆమె ప్రాణాలు తీయించేకంటే ప్రమాదపూరితమైన

ప్రయత్నం ఆపివేయడం గురించి చెప్పాను" అన్నాను.

"అప్పుడు ఆమె మళ్ళీ నీకోసం ప్రయత్నిస్తుంది. ఆమె మూలంగా నువ్వు ప్రమాదంలో ఇరుక్కోవడం నాకిష్టం లేదు. నీ అవసరం మాటటుంచి, నీ స్నేహం నాకు అవసరం. నిన్ను రక్షించుకోనేందుకు ఏమైనా చేస్తాను. ఆమె ప్రాణాలేకాదు. అలాంటివాళ్ళవి మరో పదిమంది ప్రాణాలుపోయినా ఫరవాలేదు" అన్నాడు నాయకుడు ఆవేశంగా.

నాకు ఆనందం కలిగింది.

కనీసం రెండురోజులపాటు ఆగమని బ్రతిమలాడాను. దానికీ అయిష్టంగా తలూపాడు నాయకుడు. అంతలో నా మకాం వచ్చేసింది. నన్నక్కడ వదిలేసి నాయకుడు, తన అనుచరులతో వెళ్ళిపోయాడు.

"నాయకుడు అక్కడిదాకావచ్చి లోనికి రాకుండా పోయారేం?" అడిగింది డెల్లా.

ఆమెకు అసలు సంగతి చెప్పడమా మానడమాని ఆలోచించాను. చెప్పడమే మంచిదనితోచింది. వివరంగా జరిగింది చెప్పాను.

"నాయకుడి స్నేహంకన్నా, మీకు ఆ అమ్మాయిప్రేమ ఎక్కువ అవసరం లాగుంది!" అంది అంతా విని డెల్లా.

"అలాంటి మాటలనకు. అనవసరంగా ఒక ఆడదాని ప్రాణాలు తీయించడం ఎందుకని బాధపడుతున్నాను." అన్నాను.

"కులం కట్టుబాట్లు మరచి, కులంకాని మనిషితో కలుకుదామనుకోవడం పెద్ద తప్పుగాబట్టే నాయకుడు దానికి తగినశాస్తి చెయ్యాలని నిర్ణయించాడు. నువ్వు అనవసరంగా అడ్డంపోయావ్?" అంది డెల్లా.

డెల్లా ఆడది. అంతకన్నా ఎక్కువగా ఆలోచించగల దని నేననుకోలేదు. నాగరికత పెరిగిన సంఘంలో, జరిగే ఘోరాలు, నేరాలు గుర్తు తెచ్చుకుంటే ఆ ఆడమనిషి, చేస్తున్నదానిలో పెద్దతప్పు నాకు కనుపించలేదు. ఆమాట పైకిచెప్పి, డెల్లాతో రభసపెట్టుకోవడం నాకిష్టంలేదు. అందుకే మౌనంగా వుండిపోయాను.

"మనం ఇంక ఈ దీవిలోవుండి లాభంలేదు. త్వరగా వెళ్ళడం మంచిది" అంది డెల్లా.

"ఏం?"

"ఇప్పుడీ లేనిపోని గొడవలు నువ్వు తలపైకెత్తుకుంటున్నావ్. కర్మకాలి ఆమెతో కులకడం ఎవరన్నా అడవి మనుషులు చూశారంటే ఏం జరుగుతుందో నువ్వే చెప్పావ్. అలాంటిదే జరిగితే నేను ఈ అడవిలో, ఈ మనుషులమధ్య చిక్కి చావల్సివస్తుంది. అలాంటి ప్రమాద పరిస్థితి ఏర్పడకముందే మనం వేరేదారి చూసుకోవడం మంచిది!" అంది డెల్లా.

నేనేం మాట్లాడలేదు అక్కడే వెల్లకిలాపడుకున్నాను. ఆకాశంలో చంద్రుడ్ని, అతని చుట్టూ మూగివున్న చుక్కల్ని చూడసాగాను. డెల్లా లోపలికి వెళ్ళుతున్నట్లు, అడుగుల చప్పుడునుబట్టి ఊహించాను.

అలాచూస్తూ, రకరకాల ఆలోచనలుచేస్తూ, నాకు తెలీకుండానే నిద్రలోకి జారిపోయాను.

ఉన్నట్టుండి నా చెంపల కేదో చల్లగా తగిలింది. కళ్ళు తెరుద్దామనిపించింది, కానీ రెప్పలు విడివడటం లేదు. నా గుండెలపైన ఏదో అటూ ఇటూ ఆడింది. అదేమయిందీ అర్థం కాలేదు. కానీ కదులుతున్న దండని వూహించాను.

ముక్కుకు ఘాటైన వాసన సోకింది. అది నసాళానికంట గానే నాలో జాగృతమౌతున్న చైతన్యం, తిరిగి మత్తులో కొరిగిపోతున్నట్లయింది. మరుక్షణంలోనే ఏమవుతున్నదీ తెలియలేదు.

కళ్ళు తెరచాను. చూశాను. పైన దట్టమైన ఆకుల్తో అల్లిబిల్లిగా అల్లుకుపోయిన చెట్ల కొమ్మలు కనుపించాయి. తక్కున లేచి కూర్చున్నాను. చుట్టూ చూశాను. అడవి మధ్యలో వున్నట్లు తెలుసుకొన్నాను.

ఇంటి దగ్గర పడుకొన్న మనిషిని, ఇక్కడి కెలా వచ్చానా అని ఆశ్చర్యపోతున్నంతలో, ఆమె చెట్టు చాటు నుండి రావడం కనుపించింది.

"నువ్వా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆఁ! నేనే!" అంది నవ్వుతూ.

"నేనిక్కడి కెలా వచ్చాను?"

"నువ్వు రాలేదు. ఆకుపసరుతో మైకం కలిగించి, నేనే మోసుకొచ్చాను." అందామె.

"ఇంత దూరం నువ్వే మోసుకొచ్చావా?"

"ఆఁ!"

"ఎవరూ చూడలేదా?"

"మీ గూడెం మనిషిని కాపలా పెట్టినట్టున్నాడే నాయకుడు. వాడు చూశాడు. నన్ను ఆపేందుకు ప్రయత్నించాడు. కానీ నేనే జయించాను" అంది. ఆమె మాటలు నాకు అర్థం కాలేదు.

"ఎలా జయించావ్?"

"నా రహస్యం తెలుసుకున్నాక అతను బ్రతకడం ప్రమాదకరం. అందుకనే చంపేశాను" అందామె.

"చంపేశావా?"

"చెప్పాగా ముందే" అంది మళ్ళీ.

"ఎందుకిలాంటి సాహసం చేశావ్? దీంతో నీ రహస్యం అందరికీ తెలిసిపోతుంది. ఆ తర్వాత నిన్ను చంపుతారు, దానివల్ల నీకు వచ్చేదేమిటి?" అన్నాను.

"అది సరే! ఆ నాయకుడికి నువ్వు నా సంగతి చెప్పావా?" అనుమానంగా అడిగింది.

"లేదే!" అన్నాను.

"చెప్పకుంటే అతను నీ వెంట ఎందుకొచ్చాడు? నన్ను నువ్వు వుండమన్నచోట అంతసేపు ఎందుకాగి చుట్టూ చూశాడు?" అడిగింది.

ఆమె ప్రశ్నలకు సరయిన జవాబు చెప్పడం కష్టమని తెలుసు నాకు. అందుకే ఆలోచించి "ఏమో! నాకు తెలీదు. తెలుసుకోవాలంటే అతన్నే అడుగు" అన్నాను.

"ఇన్నాళ్ళు లేనిదీ, ఇప్పుడే క్రొత్తగా తన మనిషిని నీ మకాం ముందు కాపలా వుంచాడు. వీట్ని బట్టి చూస్తే నన్ను వదిలించుకోవడానికి నువ్వే ఈ ఏర్పాట్లన్నీ చేయించు కొన్నట్లున్నావ్?"

"లేదు! అలాంటిదేమీ లేదు" అన్నాను. ఆమె ఒక హత్య కూడా చేసిందని తెలిశాక భయం కూడా పుట్టింది.

"ఏది ఏమయినా, నువ్వు నాకు కావాలి! ఈ ప్రయత్నంలో నా ప్రాణాలే కాదు, మీ ప్రాణాలు పోయినా నాకు లెఖ్ఖ లేదు. ఎవ్వరూ నన్ను ఆపలేరు" అందామె.

అర్ధరాత్రిపూట వచ్చి, నన్ను మైకంలో తోసి, ఇంత దూరం మోసుకు రాగలిగిన మనిషి, అడ్డమొచ్చిన మనిషిని అమాంతం హత్య చెయ్యగలిగిన మనిషి, ఎంతకయినా తెగించగలదనీ, ఎంత సాహసమైనా చెయ్యగలదనీ, తెలిసి పోయింది.

ఆమె కోరిక తీర్చకుండా అక్కడినుండి తప్పించుకొని పోవడం అసాధ్యం. అలాగని ఆమె కామవాంఛల జ్వాలలు ఆర్పేందుకూ, నాకు మనస్సు రావటంలేదు. మరోమారు నయాన ఆమె జేస్తున్న తప్పు ఎంత ప్రమాదకరమో చెప్పి చూద్దామనిపించింది.

మళ్ళీ ఆ విషయం ఎత్తాను.

ఆమె విసుగ్గా చూచింది నాకేసి. ఆ తర్వాత "ఎందుకిలా మాటల్తో అనవసరంగా కాలం ఖర్చు పెడతావ్! గూడెం వెళ్ళేప్పుడే నా కోరిక తీర్చి వుంటే, ఈ రభస జరిగేదే కాదు! రోజూ ఆ టయిమ్‌కు నీ కోసం అక్కడికొస్తాను. పది నిముషాలు నన్ను సుఖపెట్టు. నీకు ఏ ప్రమాదం రాకుండా చూస్తాను" అంది ఆమె.

ఇక వాదించి లాభం లేదని తేల్చుకున్నాను. యాంత్రికంగా ఆమెను సుఖపెట్టాను. నవ్వి వెళ్ళిపోయింది. నేను దారి వెతుక్కుంటూ అడవికి అడ్డంపడి చీకట్లో, చెట్ల క్రింద నడచుకొంటూ నా మకాం చేరాను. నేను అడుగెట్టేసరికి డెల్లా కూర్చుని వుంది.

"గంటనుంచి చూస్తున్నాను. ఎక్కడి కెళ్ళావ్?" అడిగింది డెల్లా.

ఏం చెప్పనూ తోచలేదు.

మాట్లాడకుండా వెళ్ళి ప్రక్కన కూర్చున్నాను.

"ఇంత సేపూ ఏం చేస్తున్నావ్?"

"ఏంతోచక అలా వెళ్ళాను" అన్నాను.

డెల్లా అనుమానంగా చూసింది.

"కాదు! నన్ను వదలిపెట్టి వెళ్ళిపోదామనుకునివుంటావ్. కొంతదూరంపోయాక ఏదో అవాంతరం వచ్చి వుంటుంది.

"ఛా! అదేం లేదు. నిన్నువదలి ఎలా వెళ్తాను?"

"అయితే ఎక్కడి కెళ్ళావ్?" అడిగింది ఘట్టిగా.

అంతకుముందు చెప్పిన మాటే మళ్ళీ చెప్పాను.

"రాజ్! నన్ను వెర్రిదాన్ని చేసి ఆడించాలనుకోకు. మనం ఇన్నాళ్ళు కలిసి కష్టాలుపడ్డాం. నీకు ఎందుకనో ఈ అడవి మనుష్యుల్తో ఈ అడవిలోనే వుండాలన్న కుతూహలం ఏర్పడింది. దానికి కారణాలు నాకు తెలియలేదు. నాకది ఇష్టంలేదు. నన్నెలా వదలించుకోవాలాని దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నావ్. నీ కంత బాధ అవసరంలేదు. నీ దోవన నువ్వు వెళ్ళిపో, నేను ఇవాళే వెళ్ళిపోదలచుకున్నాను" అంది డెల్లా.

"పోతావా? ఎక్కడికి? ఎలాపోతావ్?"

"అది నీ కనవసరం! చాతనయితే నాదేశం వెళతాను, లేకుంటే సముద్రంలోపడి ఛస్తాను" అంది డెల్లాకోపంగా.

ఆమెకు ఏం చెప్పాలో, ఎలా నమ్మించాలో, ఓదార్చాలో అర్థంగాక అయోమయంగా-చూస్తూకూర్చున్నాను.

డెల్లా మాట్లాడకుండా పడుకుంది. రెండుసార్లు పిలిచాను. పలకలేదు. నేనూ మెల్లిగా పడుకున్నాను. తెల్లవారిందాకా మేలుకునే వున్నాను. కాలకృత్యాలు ముగించుకొని, "నేను గూడెం వెళుతున్నాను" అన్నాను డెల్లాతో.

"నీ యిష్టం! నాతో చెప్పవలసిన అవసరంలేదు!" అంది కోపంగా.

"ఎందుకు వెళుతున్నానో తెలుసా?" అడిగాను.

"నాకు చెప్పొద్దు!"

"లేదు డెల్లా! నీ మనస్సు కష్టపెట్టడం నాకు అయిష్టం. నువ్వు కోరినట్టే మనం ఒకటి రెండు దినాల్లో ఎక్కడ

నుండి మకాం ఎత్తేద్దాం. దాన్ని గురించి నాయకుడితో మాట్లాడేందుకు వెళుతున్నాను'' అన్నాను.

మాట్లాడకుండా మౌనంగా చూసింది డెల్లా. ఇక ఆమెకు నచ్చచెప్పటానికి ప్రయత్నించినా ఫలితం వుండదన్న అభిప్రాయంతో వెలుపలకొచ్చాను.

గూడెంవేపు నడవసాగాను.

రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది, ఆ ఆడమనిషి చాలా ప్రమాదకరమయిన వ్యక్తి. ఆమెనుంచి తప్పించుకోకుంటే, ప్రాణాలు పోవడం ఖాయం. తప్పించుకునేందుకున్నది ఒక్కటే మార్గం. అది ఈ దీవినుండి వెళ్ళిపోవడమే. నాయకుడితో జరిగిందంతా చెప్తే, అతను ఆమెను శిక్షించేందుకు ప్రయత్నిస్తాడు తప్ప, నన్ను వెళ్ళనివ్వడు. అతని సాయం లేకుండా వెళ్ళాలి. ఎలా వెళ్ళడమాని ఆలోచించాను.

ఏదైనా స్టీమరువస్తే బాగుండుననిపించింది. అది వచ్చేదాకా వెళ్ళి సముద్రంలో ఎదురు చూద్దామనుకున్నాను. అక్కడికి నాయకుడి మనుషులు వెతుక్కుంటూ రావచ్చు. తాము సులభంగా చిక్కిపోతారు. వేరే పథకంకోసం ఆలోచించాను. అంతలో గూడెం వచ్చింది.

నాయకుడి ఇంటిముందు అడవి మనుషులంతా నిలబడి వున్నారు. నేను వాళ్ళను తప్పించుకొని వెళ్లాను. నాయకుడు కూర్చుని వున్నాడు. అతని కాళ్ళ దగ్గర అడవి మనిషి శవం వెల్లకింతలా పడివుంది. శవం గుండెలో పొడవుపాటి అమ్ము దిగబడివుంది.

నన్ను చూడగానే నాయకుడు దగ్గరకు రమ్మని చెయ్యి ఊపాడు.

వెళ్ళి నిలుచున్నాను ప్రక్కనే.

"ఏమిటిది? ఎవరు చంపారు అతన్ని?" అడిగాను.

"అదే అర్థం కావటంలేదు. రాత్రి అతను నా వెంట వచ్చాడు నీ మకాంకు. తిరిగివచ్చేటప్పుడు, నీకు రక్షణగా వుండమని కాపలా పెట్టి వచ్చాను" అన్నాడు నాయకుడు.

"నాకు మరి రాత్రిచెప్పలేదే?"
"నీకు తెలీకుండా వుండాలని కావాలనే చేశాను."
"ఎవరు చంపారో తెలిసిందా?"

"తెలీలేదు. కాని ఆ అమ్ము చూశావా? అది మా మనుషులు ఉపయోగించేదే. దాన్నిబట్టి ఎవరో మా గుంపు లోని వాళ్ళే ఈ ఘోరంచేసి వుండాలనిపిస్తుంది. అందర్నీ సమావేశపరచాను. అడిగాను. ఎవ్వరూ ముందుకొచ్చి నేరం ఒప్పుకోవడంలేదు. ఇలాంటి విచిత్రం మా తెగలో పది తరాలనుండి జరగలేదు. ఎవరయినా తప్పుచేస్తే వచ్చి చెప్పుకొని నాయకుడి కాళ్ళపైన పడిపొయ్యే వాళ్లు ఈ మారు అలా జరగకపోవటం వింతగానూ, విచిత్రంగానూ వుంది" అన్నాడు నాయకుడు. ఆ మాటలు చెపుతూంటే, అతని కళ్ళల్లో, కోపం, అవమానం, కొట్టొచ్చినట్లు కనిపించాయి.

నాకు తెలుసు అసలేం జరిగిందో, రాత్రి నన్ను పొందాలని వచ్చిన ఆడమనిషే అతన్ని చంపింది. కానీ ఆమెకు ఈ గుంపు వాళ్ళు వాడే బాణం ఎలా దొరికివుంటుందాని ఆలోచించాను.

అప్పుడు గుర్తొచ్చింది, నాయకుడు నా ఆత్మరక్షణ కోసం ఇచ్చిన బాణం అమ్ముల విషయం. ఆ తర్వాత హత్య ఎలా జరిగివుంటుందో ఊహించేందుకు పెద్ద ఆలోచన అవసరం లేకపోయింది.

రాత్రి జరిగిన దంతా చెప్తే నాయకుడు బహుశా తన గుంపులోని వాళ్ళను అనుమానించడం మానివేసి, ఆ ఆడ మనిషికి తగిన శిక్ష లభించే ప్రయత్నం చేస్తాడను కున్నాను. కానీ అందరి మధ్య నేను అల్లరిపాలు కాక తప్పదు. చెప్పడమా, మానడమాని ఆలోచిస్తూ కూర్చు న్నాను.

శవాన్ని అక్కడినుంచి తరలించమని పురమాయిం చాడు. రాత్రికి అందర్నీ కొండదేవత విగ్రహం ముందుకు రమ్మన్నాడు.

అందరూ వెళ్ళిపోయారు.

"ఈ నేరం ఎవరు చేసిందీ ఎలా తెలుస్తుంది?" అడి గాను.

"రాత్రికి దేవతకు పూజచేస్తాను. ఆమె ముందు ఆకాశ మెత్తున లేచే మంటలు వేస్తాము. ఒక్కొక్కర్నీ మంట లోకితోస్తాం. తప్పుచెయ్యనివాడికి ఏ విధమైన ప్రమాదం గానీ, గాయాలుగానీగావు. అలా గాయాలు అయినవాడే హంతకుడు. వాడ్ని ఆ మంటల్లోనే వేసి దహనం చేస్తాను" అన్నాడు నాయకుడు అక్కసుతో.

విచిత్రంగా తోచింది నాకు. మంటల్లో ఎవరు చిక్కు కున్నా గాయాలు కావడం నిజం. అలాంటప్పుడు అసలు హంతకుణ్ని ఆ పద్ధతిలో గుర్తించటానికి చేసే వీళ్ళ ఘోరమైన పద్ధతి, ప్రయత్నం నన్ను భయకంపితుణ్ణి చేశాయి.

"ఇంతకు ముందెప్పుడన్నా ఈ పద్ధతిలోనే నేరస్తుణ్ణి కనిపెట్టారా?" అడిగాను.

"నా హయాంలో ఇంతదాకా అలాంటి సమస్య గాలేదు. ఇదే మొదటిసారి. కానీ మా గూడెంవాళ్ళు

అనుసరించవలసిన పద్ధతిమాత్రం ఇదే!" అన్నాడు నాయకుడు.

"మంటల్లోకి మనిషి దూకితే శరీరం కాలకుండా ఎలా వుంటుంది?" అడిగాను.

"నిరపరాధిని కాపాడే బాధ్యత మా కొండదేవతకు అప్పగిస్తాను. ఆమె సత్యమే వాళ్ళని కాపాడాలి" అన్నాడు నాయకుడు.

"విచిత్రంగా వుంది" అన్నాను.

"మేమే విచిత్రం మీకు. మా పద్ధతులు విచిత్రంగా గాక మరెలా వుంటాయి. రాత్రికి నువ్వూరా! చూద్దూ గాని. మా కొండదేవత ఎంతసత్యమైందో, ఆమె మమ్మల్ని ఎంతగా కాపాడుతూంటుందో తెలుసుకొందువుగాని" అన్నాడు నాయకుడు.

"అలాగే!" అన్నాను.

అప్పుడు గూడా అసలు నిజం చెప్దామనుకొన్నాను. కాని నాయకుడు నన్నూ అనుమానించవచ్చు. లేనిపోని చిక్కుల్లో పడతానని భయమేసింది.

ఆ తర్వాత విస్కీ త్రాగాం ఇద్దరం. మాటలమధ్యలో అన్నాను "త్వరలో వెళ్ళిపోదామనుకుంటున్నాను."

తలెత్తి నావేపు చూశాడు నాయకుడు.

"ఈ విషయం గురించి నువ్వు పదే పదే నాకు చెప్పి ప్రయోజనంలేదు. నా కిష్టమైనప్పుడు అన్ని ఏర్పాట్లుచేసి పంపుతాను" అన్నాడు నాయకుడు కృతనిశ్చయంతో.

ఏం చెప్పినా లాభంలేదని తెలిసొచ్చాక, వుండి ప్రయోజనం లేదని లేచాను వెళ్ళిపోదామని.

"రాత్రికిరా! తప్పకుండా."

"వస్తాను" అన్నాను.

పెట్టెనుకూడా తీసుకురా! మన గుంపులోని ఆడముఠా మొత్తం వస్తుంది" అన్నాడు నాయకుడు.

"చెప్తాను. వస్తానంటే తీసుకొస్తాను" అని లేచాను.

చిక్కటిచెట్ల సందునున్న కాలిబాటన నడుస్తూ ఆలోచించసాగాను. నా పరిస్థితి అడకత్తెరలో పోకలా తయారయింది. ఇంతకుముందు డెల్లా ఒక్కతే ఇక్కడనుండి పారిపోదామని పోరు చేసేది. ఇప్పుడీ అడవిమనిషి నన్ను ఉచ్చులో బిగించింది. కనీసం ఆమెబారినుండి తప్పించుకోనేందు కయినా పారిపోక తప్పదనిపించింది. ఎలా పోవాలి? ఎటు పోవాలి? అన్నవే నా ముందున్న సమస్యలు.

గుడిసెలోకి అడుగుపెట్టి మౌనంగా కూర్చున్నాను.

"ఏమిటలా మౌనంగా వున్నావ్?" అడిగింది డెల్లా.

"మనం పారిపోదాం!" అన్నాను.

"నిజంగాగా?"

"ఆఁ!"

"ఎప్పుడు?"

"ఈ రాత్రికే. ఇంక ఆలస్యంచేసి లాభంలేదు. ఈ రాత్రి దాటిందంటే బహుశా మనమీ దీవినుండి అసలు తప్పించుకోవడం అసాధ్య మనుకుంటాను — అదే ప్రాణాలతో...?" అన్నాను.

"ఎందుకని?" అడిగింది డెల్లా.

"ఆ వివరాలు అడగొద్దు. తర్వాత తాపీగా చెప్తాను. మనకు అవసరమయ్యే సామానులు, కొద్దిగా ఆహారం, కాసిని మంచినీళ్లు, విస్కీ, సిగరెట్లు మొత్తం పాక్ చేసి పెట్టు. నీది నాది తుపాకీ కూడా తీసుకెళ్దాం."

"సరే! నాయకుడికి చెప్పావా?"

"లేదు."

"అతని మనుషులు మనల్ని వెంటాడితే ఏం చెయ్యాలి?"

"తుపాకులు తీసుకెళ్ళేది వాళ్ళకోసమే."

"అంటే వాళ్ళను కాల్చి చంపడమేనా?"

"అంతకన్నా మరో మార్గం లేదు!" అని సామానులు సర్దేపనిలో మునిగిపోయాను. డెల్లా కూడా నాకు సాయం చెయ్యసాగింది. గంటలోనే మా సర్దడం పూర్తయింది.

చీకటి పడగానే బయలుదేరదలచుకున్నాను. నేను కొండదేవత వద్దకు రాలేదని నాయకుడు పసిగట్టి తన మనుషుల్ని నాకోసం పంపేలోగా, నేను డెల్లా సముద్రంలో అంతకు ముందు దొంగతనం చెయ్యడం కోసం వెళ్ళిన కొండ ప్రాంతాలకు వెళ్ళాలని తీర్మానించుకున్నాను. అంతదాకా పోవడం వరకే నేను ఆలోచించగలిగాను. ఆ తర్వాత ఏమవుతూందన్నదీ, ఏం చెయ్యాలి అన్నదీ నాకు తెలీలేదు. మా భారం భగవంతుడిపైన వెయ్యడంకన్నా చెయ్యగలిగింది కూడా ఏమీ వున్నట్టు తోచలేదు.

వెలుతురు తరిగిపోతూ చీకటి దాన్ని సన్నగా చీల్చుకుంటూ రాసాగింది. డెల్లా, నేనూ మౌనంగా గుడిసె వెలుపల కూర్చున్నాం. మా కిద్దరికీ మొయ్యగలిగినంత బరువున్న రెండు సంచీలున్నాయి. వాటికి తోడు తుపాకీలు కూడా వున్నాయి.

నాకు కొండ దేవత ముందు రాత్రికి జరగబోయే తతంగం గుర్తొచ్చింది. అడవి మనిషిని చంపిన హంతకుణ్ణి ఆ దేవత పట్టి ఇస్తుందన్న వాళ్ళ నమ్మకంలో అర్థం కనుపించకపోయినా, పూర్తిగా కొట్టిపారవేసే స్థితిలో లేను నేను. అందరివంతూ [illegible]

ముందుకు పంపితే, ఆ హత్యకు నేను కారకుణ్ణని ఏదయినా సంకేతం ద్వారా నాయకుడికి తెలుపుతుందేమో ఆమె అన్న భయమే, పారిపోయే ప్రయత్నానికి నన్ను పూర్తిగా పురికొలిపింది.

చీకటి దట్టంగా పేరుకుంది.

సంచీతీసి భుజాన వేసుకొని, తుపాకి ఎత్తిపట్టుకొని, "బయలుదేరు పోదాం!" అన్నాను డెల్లాతో.

నాలాగే డెల్లా కూడా సామాను ఎత్తుకొని బయలు దేరింది. ఇద్దరం మాటా, పలుకూ లేకుండా, చుట్టూ చూసుకుంటూ, నడవసాగాం సముద్రం వైపు. గంట తర్వాత సముద్ర తీరం చేరుకున్నాం.

"అమ్మయ్య!" అన్నాను సముద్రం చూడగానే.

"మనల్ని ఎవరూ చూచినట్లు లేదు" అంది డెల్లా.

"ఈ ప్రాంతాల్లో అడవి మనుషులు సముద్ర దొంగ తనాల కోసం వాడే డింగీల్లాంటివి వున్నాయి. వెతికి వస్తాను. నువ్వు ఇక్కడే వుండు" అంటూ సంచీ తీసి క్రింద పెట్టాను.

"ఒంటరిగా వుండాలంటే భయంగా వుంది. నేను కూడా వస్తాను" అంది డెల్లా.

"ఇప్పుడే వచ్చేస్తాను. భయపడవలసిన అవసరంలేదు." అంటూ ధైర్యం చెప్పాను.

అయిష్టంగానే ఆగిపోయింది డెల్లా అక్కడ.

నేను తుపాకీ ఊపుకుంటూ నీళ్ళ అంచునే ముందుకు నడిచాను. ఫర్లాంగు దూరం వెళ్ళాక కనుపించాయి ఇసుకలో కూరుకొని వున్న డింగీలన్నీ. మెల్లగా వాటి మధ్యకు వెళ్ళాను.

అక్కడ కనుపించిన దృశ్యం నన్ను అప్రతిభుణ్ణి చేసి వేసింది. చైతన్యం నశించింది. కళ్ళు బైర్లు కమ్మాయి. నోట మాట రాలేదు.

"ఎందుకలా వణుకుతున్నావ్? ఎవరో కాదు. నేనే!" అందామె డింగీలో కూర్చుని నవ్వుతూ.

"నువ్వే! తెలుస్తున్నావ్. ఇక్కడి కెందుకొచ్చావ్?" అడిగాను.

"నీ కోసం!" అందామె.

"నా కోసమా? ఎవరు చెప్పారు ఇక్కడి కొస్తానని?" అడిగాను కోపంగా.

"ఎవ్వరూ చెప్పలేదు. నేనే చూశాను. వెంటబడి వచ్చాను." అందామె మళ్ళీ నిర్వికారంగా.

నాకేం చెయ్యాలో తోచలేదు. ఆమె మమ్మల్ని వెంటాడి వచ్చింది. ఎప్పట్నుంచి నన్ను గమనిస్తుందో మరి. నా మకాం నుండి బయలుదేరాక వెనుకా ముందూ, చూసుకుంటూనే వచ్చాను నేను. ఏవిధమైన అలికిడీ వినిపించలేదు. అంటే నేను సముద్రం వైపు నడవడం గమనించి, అడ్డదారిన ఆమె డింగీల వద్దకు చేరివుండాలను కున్నాను.

"మమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళిపోవాలని బయలుదేరావా?" అడిగింది ఆమె దిగులుగా.

"అవును. నిజానికి కొన్నాళ్ళు ఇక్కడ వుండి వెళ్దా మనుకున్నాను. కానీ నీవల్లే ఇలా వెళ్ళిపోవలసి వచ్చింది. నువ్వు చేసిన ఘోరానికి మా నాయకుడు ఈ రాత్రికి అందరినీ కొండ దేవత ముందు హాజరు పరచాడు" అన్నాను.

"ఇలా వెళ్ళడం నేను ఒప్పుకోను. ఎవ్వరూ చూడ లేని చోట నిన్నూ, నీ పెట్టను దాచిపెడతాను. మీకు అన్నీ నేను చూస్తాను. నా వెంట రండి" అందామె.

"మమ్మల్ని వదిలెయ్యి. జరిగింది మర్చిపో" అన్నాను నిష్కర్షగా.

"ఇక్కడ్నించి ఈ డింగీలో ఆ కొండదాకా వెళ్ళగలరు' ఆ తర్వాత వెళ్ళలేరు. వెనక్కి వస్తే మీ గూడెంలోని నాయకుడు తన్ను మోసంచేసి పారిపోయినందుకు ఇద్దర్నీ నిలువునా నరికేస్తాడు. అంటే చావు తప్పదు. వెనక్కి రాకన్నా, ఆ కొండపైన రెండ్రోజు లుంటారు. చలికి చచ్చిపోతారు. ఎటూ చావు తప్పనప్పుడు, నా మాట విని వెంట రావటం మంచిదిగదా! కనీసం కొన్నాళ్ళ పాటయినా మీకు ఏ భయం లేకుండా బ్రతికే ఏర్పాటు చేయగలను నేను." అందామె వాళ్ళ భాషలోనే.

ఆమెకు శరీరంలో ఏనుగులాంటి బలం తప్ప మెదడులో తెలివి లేదనుకున్న నా అంచనా తారుమారయినందుకు నవ్వులాంటి ఏడుపొచ్చింది.

"నువ్వెన్ని చెప్పినా లాభం లేదు. మేము వెళ్ళి తీర వలసిందే" అన్నాను దృఢమైన నా నిశ్చయాన్ని తెలియ బరుస్తూ.

"ఎలా వెళ్తారో చూస్తాను!" ఆమె కూడా అంది మొండిగా.

"ఆపుతావా?"

"ప్రయత్నిస్తాను. కాదని వెళ్ళావంటే తెల్లారేలోపల మీ నాయకుడ్ని, అతని మనుషుల్ని మొత్తం నీ మీదకు తరుముతాను. నువ్వెటూ ఆ కొండ దగ్గర వుంటావ్. ఆ పైని జరిగేది నువ్వే చూద్దువుగాని," అంది ఆమె.

ఆలోచించాను క్షణంసేపు. ఆమెవి ఉత్త మాటలు కాదు. అనుకున్నది సాధించే తత్వం ఆమెది. ఆ విషయం నాకు ముందే ఋజువయి వుంది.

"ఇక్కడే వుండు. నా పెట్ట దూరంగా అక్కడ కూర్చొనుంది. ఆమెతో కూడా మాట్లాడి వస్తాను" అన్నాను.

"అలాగే! వెళ్ళిరా!" అంది.

అక్కడ్నుంచి కదిలాను డెల్లావేపు.

డెల్లాకీ విషయం చెప్పి ప్రయోజనం లేదని నాకు తెలుసు. ఆమెకు నాపైన ముందునుండే కోపంగా వుంది. ఈ ప్రమాదం నుండి తప్పించుకోవాలంటే ఒకటే మార్గం కనిపించింది. అది ఆమెని హతమార్చడం.

ఆడమనిషి! అన్యాయంగా హత్య చెయ్యడానికి మనస్సు వెనకాడింది. ఆమె ఒక్క ప్రాణం కన్నా, మా రెండు ప్రాణాలు కాపాడుకోవడం మేలని కూడా అనిపించింది. నా దగ్గర తుపాకీ వుంది. దాంతో కాల్చి చంపడం సులభం. అంతకన్నా ఆమె నుండి తప్పించుకోనేందుకు మరో మార్గం కూడా కనిపించలేదు.

"ఇంత సేపయిందేం?" అడిగింది డెల్లా.

జరిగిందంతా చెప్పాను మొదటిసారిగా ఆమెకు. వింటూంటే ఆమెకు నాపై చెప్పలేనంత కోపం రావడం గమనించాను.

"మనకేం దారి?" అడిగింది.

"ఆలోచించాను. ఆమెను చంపడంకన్నా మరో మార్గం లేదు!" అన్నాను.

"వెళ్తూ వెళ్తూ ఒక ఆడమనిషిని హత్య చేసి పోవాల్సిందేనా?" తన అయిష్టం తెలిపింది.

ఆ విషయం గురించి చర్చించి ప్రయోజనం లేదని మానేసి ఆమెను బయలుదేరమన్నాను. సంచీ పుచ్చుకొని బయలుదేరింది. నా సంచీ కూడా ఆమెను పట్టుకో మన్నాను. తుపాకీ సరిచేసి పెట్టుకొన్నాను. సేఫ్టీ కాచ్ రిలీజ్ చేశాను.

ఇద్దరం డింగీల వైపున నడిచాం.

దూరం నుంచే చూశాను. ఆమె అంతకు ముందున్న చోటే నిలబడి మాకేసి చూస్తూ వుంది.

భగవంతుణ్ణి మనస్సులో తలచుకుని, కళ్ళు మూసుకొని, ఆమెకు గురి చూసి ప్రేల్చాను.

వరుసగా ఆరు తుటాలు వర్షంలా ఆమె వేపు పరుగెత్తాయి.

నెత్తురు మడుగులో వుంటుందామె. ఆ దృశ్యాన్ని చూసే ధైర్యంగానీ, తెగింపుగానీ, నాకు లేవు. కళ్ళు ఘట్టిగా మూసుకున్నాను.

"అదిగో ఆమె తప్పించుకుంది!! పారిపోతూంది!!!" అరచింది పెద్దగా.

నా గుండెలు జారిపోయాయి.

హడావుడిగా కళ్ళు తెరచాను. ఆమె దూరంగా కుందేలుకన్నా స్పీడుగా కుప్పిగంతులు వేసుకుంటూ సునాయాసంగా పరుగెత్తుకు పోవడం కనుపించింది.

ఆమె వైపు కురిశాను. మరో రెండు రౌండ్లు పేల్చాను. అవీ వ్యర్థమైనాయి. ఆమె ఎప్పుడో మాయమయింది.

తిరిగి వచ్చాను డెల్లా వద్దకు.

"వెళ్ళిపోయింది కదూ?" అడిగింది.

(ఇంకా వుంది)